వదలని వరుణుడు



కోడిచిర శివారులో నీట మునిగిన సోయాబీన్



తాడ్వాయి: కరడ్‌పల్లిలో నిండుగా ప్రవహిస్తున్న వాగు

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలో బుధవారం కూడా భారీ వర్షం కురిసింది. సోమవారం రాత్రి మొదలైన వాన బుధవారం రాత్రి వరకూ పడుతూనే ఉంది. వర్షానికి పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు నిండుగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు కూడా కొన్ని చోట్ల నీట మునిగాయి. మరి కొన్ని చోట్ల వరి నాట్లు ఊపందుకున్నాయి. భారీ వర్షాల కారణంగా కొన్ని చోట్ల రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడింది. కొన్ని గ్రామాల్లో ఇళ్లు, చెట్లు కూలాయి.



మద్నూర్ శివారులో..



భిక్కనూరు వద్ద జోరుగా ప్రవహిస్తున్న ఎడ్ల కట్టవాగు



కుప్రియాల్‌లో ఉన్నత పాఠశాల ఆవరణలో కిచెన్ షెడ్డుపై కూలిన చెట్టు



ఎల్లారెడ్డి: కల్యాణిలో పాక్షికంగా కూలిన ఇల్లు



భిక్కనూర్ శివారులో వర్షానికి కూలిన చెట్టు

శిథిలమైన ఇళ్లలో ఉండొద్దు

కామారెడ్డి టౌన్: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా శిథిలావస్థ, కూలిపోయే ఇళ్లలో ప్రజలు ఉండొద్దని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ బుధవారం తెలిపారు. తక్షణమే ఖాళీ చేసి సురక్షితమైన ఇళ్లలోకి వెళ్లాలన్నారు. అలాగే నూతనంగా గృహ నిర్మాణాలు చేపట్టే యజమానులు పిల్లర్ల గుంతలు, సెల్లార్ల కోసం తీసే గుంతలవైపు ఎవరూ వెళ్లకుండా రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని, వాచ్‌మెన్‌లను ఉంచాలని లేని పక్షంలో యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వర్షాలు కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని ఎల్లారెడ్డి ఎస్సై గణేష్ బుధవారం తెలిపారు. రెండు రోజులుగా వర్షాలు బాగా కురుస్తున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ తీగల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇనుప విద్యుత్ స్తంభాలను అస్సలు తాకవద్దని సూచించారు. రైతులు స్టార్టర్ బాక్సులకు తాకవద్దని, రోడ్డుపై కల్వర్టుల వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే వాటిపై నుంచి దాటవద్దని అన్నారు.

క్లుప్తంగా

ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీవోగా రవీందర్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఎంపీడీవోగా రవీందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్లారెడ్డి ఎంపీడీవోగా పని చేసిన నారాయణ గుండెపోటుతో మృతి చెందడంతో, ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులను నిర్వర్తిస్తున్న రవీందర్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమిస్తూ జెడ్పీ సీఈవో ఉత్తర్వులు జారీ చేసినట్లు వారు తెలిపారు.

డీసీసీబీ చైర్మన్ పుట్టిన రోజు సందర్భంగా వైద్య శిబిరం

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని బస్టాండ్‌లో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకు యూత్ కమిటీ సభ్యులు వైద్య శిబిరం నిర్వహించారు. దీనిలో భాగంగా బాన్సువాడ సెవెన్ హిల్స్ ఆస్పత్రి సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ప్రయాణికులు, గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్,నాయకులు కంది మల్లేశ్, మైశాగౌడ్, ఖలీల్, ఇమ్రాన్, సాయిరాం, భూమయ్య, భూమేశ్ పాల్గొన్నారు.

టార్పాలిన్ల పంపిణీ

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దంపతులు మద్ది రామకృష్ణారెడ్డి–తేజస్వీలు తమ పుట్టిన రోజు సందర్భంగా గుర్జకుంట గ్రామంలోని నిరుపేదలకు ఇళ్లు కప్పుకునేందుకు టార్పాలిన్లను బుధవారం పంపిణీ చేశారు. గుర్జకుంటతో పాటు ఇతర గ్రామాల్లో నివసిస్తున్న పలు రాష్ట్రాలకు చెందిన నిరుపేదలైన 23 మందికి రూ.33 వేల విలువ చేసే టార్పాలిన్లను అందజేశారు. రామేశ్వర్‌పల్లి ఎంపీటీసీ సభ్యుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, కిసాన్‌విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు చేపూరి రాజు, ఐటీ విభాగం జిల్లా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళకు చేయూత



కామారెడ్డి రూరల్: ఇస్రోజీవాడిలో అట్కూరి ముత్తవ్వ అనే ఒంటరి నిరుపేద మహిళకు సర్పంచ్ కొత్త మమత రాజు చేయూతనందించారు. ముత్తవ్వకు గ్రామంలో ఓ గుడిసె ఉండేదని ప్రస్తుతం వానలకు ఆ గుడిసె కూడా కూలిపోవడంతో గ్రామంలోని బస్‌షెల్టర్‌లో నివాసం ఉంటుందని తెలిపారు. దీంతో ఆమెకు బస్‌షెల్టర్ ఆవరణలోకి వర్షపు నీరు రాకుండా తాటిపత్రి, కప్పుకోవడానికి దుప్పటి అందజేసినట్లు తెలిపారు. ఉపసర్పంచ్ చిందం మల్లేష్, కడారి మల్లేష్, ఎస్ఎంసీ చైర్మన్ బాలమల్లు ఉన్నారు.

వీరేశం ఆత్మకు శాంతి చేకూరాలి

బాన్సువాడ: వీరేశం ఆత్మకు శాంతి చేకూరాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రార్థించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీర్కూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లాడేగాం వీరేశం దశదిన కర్మకు స్పీకర్ హాజరయ్యారు. వీరేశం పార్టీకి చేసిన సేవలు మరువలేమని అన్నారు. వీరేశం కుటుంబ సభ్యులకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని అన్నారు. నాయకులు ద్రోణవల్లి సతీష్, రఘు, సందీప్, నాగేశ్వర్‌రావు, రాజు, శశికాంత్ తదితరులు ఉన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ గ్రామ శివారు 44వ జాతీయ రహదారిపై బుధవారం ఓ కారు అదుపు తప్పి డివైడర్ ఎక్కి బోల్తా కొట్టింది. కారు హైదరాబాద్ వైపు నుంచి నిజామాబాద్ వైపునకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారులో ఉన్న ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పోలీసులకు ధన్యవాదాలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): అటవీ ప్రాంతంలో చలనం లేకుండా పడి ఉన్న వృద్ధుడిని మంగళవారం పోలీసులు కాపాడిన విషయం తెల్సిందే. బాధితుడు వడ్ల నర్సింహులు ప్రస్తుతం బాన్సువాడ ప్రభుత్వం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాపాడిన పోలీసులకు బుధవారం నర్సింహులు కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి రోజూ వ్యాయామాలు చేయించాలి

పెద్దకొగప్‌గల్(జుక్కల్): ప్రతి రోజు దివ్యాంగ పిల్లలకు ఇంటి దగ్గర వ్యాయామాలు చేయించాలని ఫిజియోథెరపిస్ట్ విశాలాక్షి సూచించారు. బుధవారం ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈవో దేవి సింగ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. అనతరం దివ్యాంగ పిల్లలకు వ్యాయమాలు చేయించారు. తల్లిదండ్రులకు సూచనలు, సలహాలిచ్చారు.

సొసైటీ నిధులు దుర్వినియోగం కాలేదు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిధులు దుర్వినియోగం కాలేదని చైర్మన్ దేవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సొసైటీలో నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. సంబంధించిన వోచర్‌ను చైర్మన్, సంఘ సభ్యులు, డైరెక్టర్ల ముందు ప్రదర్శించారు. రూ. 73,08,322 సంఘ అభివృద్ధి కోసం ఖర్చు చేసినవేనని సంఘ సభ్యులు తీర్మానించారు. నిధులు దుర్వినియోగం జరిగాయని కొంత మంది సంఘ డైరెక్టర్లు ఇచ్చిన ఫిర్యాదులో వాస్తవం లేదన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న చైర్మన్ దేవేందర్‌రెడ్డి

కాంట్రాక్టు అధ్యాపకులపై చిన్న చూపు తగదు



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

భిక్కనూరు: కాంట్రాక్టు అధ్యాపకులపై ప్రభుత్వం చిన్న చూపు చూడటం తగదని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా అన్నారు. బుధవారం ఆయన సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం 2015లో ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అధ్యాపకులు యాలాద్రి, నర్సయ్య, నిరంజన్ శర్మ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



తాడ్వాయిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు



గాంధారిలో..

తాడ్వాయి/బిచ్కుంద/గాంధారి :ఉద్యోగుల సంకల్ప యాత్ర పోస్టర్లను బుధవారం బిచ్కుంద, తాడ్వాయి, గాంధారిలలో ఉద్యోగులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 25న కామారెడ్డి పట్టణంలో టీఎస్ సీపీఎస్‌ఈయూ సంకల్ప రథయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు అందరు హాజరుకావాలని పిలుపునిచ్చారు. వెంటనే ప్రభుత్వం సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు.

సమాచారం..

నేడు ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ప్రదర్శన

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయంలో గురువారం ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ప్రదర్శన నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుధాకర్ బుధవారం తెలిపారు. ఈ ప్రదర్శనకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. వీరికి ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 20 నుంచి ఆగస్టు 1 వరకు అన్ని గ్రామాలలో అవగాహన కల్పిస్తామన్నారు.

నేటి నుంచి రాగిజావ పంపిణీ



బాన్సువాడ/బాన్సువాడ రూరల్ : నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రాగిజావ అందజేయనున్నట్లు మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం బాన్సువాడలోని ఎమ్మార్సీ భవనంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు రాగి జావ, బెల్లం ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వారంలో మంగళ, గురు, శని వారాల్లో రాగిజావ, సోమ, బుధ, శుక్ర వారాల్లో గుడ్లను అందజేయనున్నట్లు వివరించారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకం

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో గతేడాది ప్రారంభమైన ప్రభుత్వ ఇంటర్ ఉర్దూ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గెస్ట్ లెక్చరర్లు నియమించినట్లు కో–ఆప్షన్ సభ్యుడు జావిద్ తెలిపారు. ఉర్దూ కళాశాల తెలుగు మీడియం కళాశాలలో ప్రస్తుతం కొనసాగుతోంది. లెక్చరర్లు కావాలని సమస్య ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే హైద్రాబాద్ కళాశాల బోర్డు కమిషనర్ నవీన్ మిట్టల్‌తో ఆయన మాట్లాడారు. దీంతో గెస్ట్‌ఫ్యాకల్టీ లెక్చరర్లను నియమించడానికి బోర్డు నుంచి అనుమతి వచ్చిందన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల సబ్జెక్టుకు బోధించడానికి లెక్చరర్లు వస్తున్నారని తెలిపారు.

పన్నెండు గంటల కరెంటు కూడా ఇవ్వడం లేదు



మాట్లాడుతున్న జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

- జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

ఎల్లారెడ్డి: వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ కూడా సరఫరా చేయడం లేదని జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం భిక్కనూర్ సబ్‌స్టేషన్‌ను కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. సబ్‌స్టేషన్‌లో వ్యవసాయ రంగానికి ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారో అనే వివరాలకు సంబంధించిన లాగ్ బుక్కులను మాయం చేశారని, కేవలం సాధారణ నోట్ బుక్కును మాత్రమే ఉంచారని అన్నారు. సంబంధిత రికార్డులను ఎందుకు మాయం చేశారని ప్రశ్నించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి తదితరులున్నారు.



బాన్సువాడలో .. కాసుల బాల్‌రాజ్

ఎక్కడిచ్చారో వివరాలు వెల్లడించండి

బాన్సువాడ: బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పినట్లు 24 గంటల ఉచిత విద్యుత్ ఏఏ గ్రామాలకు ఇచ్చారో వివరాలు వెల్లడించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. బుధవారం బాన్సువాడలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీపై కేటీఆర్ చేసిన ఆరోపణలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అన్నారు. కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకుంటున్న కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని, బంగారు తెలంగాణ కాదు బంగారు కుటుంబంలా రాష్ట్రాన్ని దోచుకున్నారని అన్నారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని అన్నారు. నాయకులు ఖలేక్, ఉద్దెర హన్మండ్లు, మంత్రి గణేష్, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

రాజంపేట: ప్రజాసమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన ప్రజాప్రతినిధులే మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరయ్యారు. బుధవారం రాజంపేట మండలంలో ఎంపీపీ లింగాల స్వరూప అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి 18 మంది సర్పంచ్‌లకు గాను నలుగురు మాత్రమే హాజరయ్యారు. ఎక్సైజ్, ఆర్టీసీ అధికారుల సభకు గైర్హాజరు కావడంపై శివాయిపల్లి సర్పంచ్ విఠల్ రెడ్డి, తలమడ్ల సర్పంచ్‌లు యాదవరెడ్డిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపైనే బెల్ట్ షాపులు నిర్వహించడంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని సభాదృష్టికి తీసుకెళ్లారు. జెడ్పీటీసీ కొండ హన్మాండ్లు, ఎంపీపీ స్వరూప, వైస్ ఎంపీపీ సావిత్రి, ఎంపీడీవో బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె



రాజంపేటలో సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు



ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు



తాడ్వాయిలో..

రాజంపేట/ఎల్లారెడ్డి రూరల్/తాడ్వాయి/భిక్కనూరు/బీబీపేట/రామారెడ్డి:తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా బుధవారం కార్మికులు దీక్షా శిబిరాల్లో కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీవో –60 ప్రకారం కనీస వేతనం కల్పించాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. పలు పార్టీల నేతలు సంఘీభావం ప్రకటించారు. సమస్యలపై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.

నగరేశ్వరుడికి అధిక మాస వాయినం



వాయినం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

భిక్కనూరు: మండల కేంద్రంలోని శ్రీనగరేశ్వరాలయంలో అధికమాస వాయనం కార్యక్రమాన్ని పలువురు మహిళలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి అభిషేకం చేశారు. అనంతరం నగరేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకం చేసి మాత పార్వతీ దేవికి, శ్రీ సీతారాములవారికి ఒడి బియ్యం ,కట్నకానుకలను సమర్పించారు. 33 రకాల వస్తువులతో అధిక శ్రావణమాసం వాయనం సమర్పించుకున్నారు.

రజకుల పొట్ట కొడుతున్నారు

బాన్సువాడ: బాన్సువాడలో బుధవారం రజక సంఘం ఆధ్వర్యంలో రజకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి సాకలి ఐలమ్మ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ.. కులవృత్తి ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా ఇతర కులాలకు చెందిన కొందరు ఇస్త్రీ దుకాణాలు ఏర్పాటు చేసుకుని రజకుల పొట్టకొడుతున్నారని అన్నారు. కులవృత్తిపై ఆధారపడ్డ రజకులకు న్యాయం చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. రజకులు మ్యాతరి సాయిలు, సాయిబాబా, సాయిరాం, మాస్కల్ల పర్వయ్య, తదితరులు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న రజక సంఘం నేతలు

ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై కోనా రెడ్డి సూచించారు. మండలంలో కాస్లాబాద్, వడ్లం, బేగంపూర్ గ్రామాల్లో చెడిపోయిన 11 సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు.



కాస్లాబాద్‌లో ఎస్సై కోనారెడ్డి, తదితరులు

సంక్షిప్తం

ప్రభుత్వ పథకాలు రైతులకు అందేలా చూడాలి

దోమకొండ: రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా రైతు బంధు సమితి ప్రతినిధులు కృషి చేయాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. దోమకొండకు చెందిన అండెం శంకర్ రెడ్డిని ఇటీవల రైతుబంధు జిల్లా డైరెక్టర్‌గా నియమించగా, బుధవారం మండలానికి చెందిన ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రభుత్వ విప్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్‌లు పన్యాల నాగరాజ్ రెడ్డి, కొడిప్యాక తిరుపతిగౌడ్, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఉన్నారు.

జూనియర్ కళాశాల మంజూరు చేయాలని డిమాండ్

బీబీపేట: మండలానికి జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరుతూ బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని టీఎస్ఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలల తరగతులను బహిష్కరించారు. ఈ ఏడాది కచ్చితంగా కళాశాల ఏర్పాటు చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీడీఎస్ఎఫ్ నాయకులు సాయికృష్ణ, బీఎల్ఎఫ్ నాయకులు నాంపల్లి తదితరులున్నారు.

గడువు ముగుస్తున్నా చర్యలు తీసుకోవడం లేదు

భిక్కనూరు: పర్యావరణ పరిరక్షణకు ఏర్పాటైన కమిటీతో ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యం చర్చించేందుకు తీసుకున్న నెల రోజులు గడువు నేటితో అయిపోతుందని కాచాపూర్ వీడీసీ చైర్మన్ మైపాల్ అన్నారు. బుధవారం వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు 86వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా మైపాల్ మాట్లాడారు. యాజమాన్యం గ్రామస్తులు ఏర్పాటు చేసిన కమిటీతో చర్చలు జరిపి పర్యావరణాన్ని పరిరక్షిస్తామని నెలరోజుల్లో సమస్యలను పరిష్కరింప జేస్తామని చెప్పినా చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.

దాశరథి అవార్డుకు ఎంపిక కావడంపై హర్షం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డికి చెందిన కవి, రచయిత, అష్టావధాని డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మ ప్రతిష్టాత్మకమైన దాశరథి కృష్ణమాచార్య అవార్డుకు ఎంపిక కావడం పట్ల తెలంగాణ రచయితల సంఘం(తెరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి.శంకర్ హర్షం వ్యక్తం చేశారు. నటేశ్వరశర్మకు తెరసం తరపున అభినందనలు తెలిపారు.

షాదీముబారక్‌తో పేదల కళ్లలో సంతోషం

మద్నూర్(జుక్కల్): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన షాదీముబారక్ పథకంతో ఆడ పిల్లలు ఉన్న పేదల కళ్లల్లో సంతోషం కనబడుతోందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బస్సీపటేల్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ క్రాంతి కుమార్ చేతుల మీదుగా లబ్ధిదారులకు షాదీముబారక్ చెక్కులను అందించారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సురేష్, ప్రజాప్రతినిధులు గఫార్, ఎంకే పటేల్, గంగాధర్, తదితరులున్నారు.

పార్ట్‌టైం స్వీపర్ల రిలే నిరాహార దీక్షలు

కామారెడ్డి రూరల్: తమ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరుతూ కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 16వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు ఉద్యోగ భద్రత కల్పించి రూ.27 వేల వేతనం చెల్లించాలన్నారు. చనిపోయిన స్వీపర్స్ స్థానంలో వారి వారసులను నియమించాలని కోరారు.